సాక్షి
బాపట్ల
బుధవారం । 7 । ఆగస్టు । 2024



విజిలెన్స్ అధికారుల దాడి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులోగల రైస్‌మిల్లును విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.



యూజీసీ కోఆర్డినేటర్‌గా అశోక్‌కుమార్

ఏఎన్‌యూ: ఏఎన్‌యూ యూజీసీ విభాగ కో–ఆర్డినేటర్‌గా అంబేడ్కర్ చైర్ అధ్యాపకులు ఆచార్య వై.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. వీసీ ఉత్తర్వులు అందజేశారు.



యార్డుకు 40,747 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 40,747 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 38,800 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోని వీఆర్వో సస్పెన్షన్

మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

కొల్లూరు : ఇసుకాసురుల ఆగడాలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వోను సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాపై గత శనివారం 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో 'తవ్వుకో తమ్ముడూ!' జిల్లా సంచికలో 'ఇసుకాసురులు పేట్రేగారు' శీర్షికలతో వెలువడిన కథనాలతో అప్రమత్తమైన జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్ కొల్లూరు మండలంలోని పెసర్లంక అరవింద వారిధి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని అదే రోజు పరిశీలించారు. ఇసుక అక్రమాలపై ఏర్పాటు చేసిన నిఘా బృందంలో సభ్యులుగా ఉన్న వీఆర్వో కె.నరేంద్రతోపాటు మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్వో కె.నరేంద్రను సస్పెండ్ చేస్తూ తహసీల్దారు బి. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పెదలంక వీఆర్‌ఏ ఎ.గురవయ్య, రావికంపాడు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.నాగరాజుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

రేపు జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సువర్ణ కుటీర్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, పేటీఎం, టెక్‌బీఎం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, జయలక్ష్మి ఆటోమొబైల్స్‌లలో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

చంద్రునికి నూలుపోగు వ్యథ

అగ్గిపెట్టెలో పట్టే పట్టు చీరలు నేసిన ఆ అద్భుత కళా నైపుణ్యం.. దైన్యంలో కుమిలిపోతోంది. నూలుపోగు పొగిలిపొగిలి కన్నీరు పెడుతోంది. చేతిలో ఉన్న పగ్గం బతుకు బండిని లాగలేకపోతుంటే తరతరాలుగా నమ్ముకున్న మగ్గం ఆశలు భగ్నం చేస్తుంటే.. జీవన పోరాటంలో నేతన్నలు నలిగిపోతున్నారు. పొట్టకూటి కోసం పరాయి వృత్తుల్లోకి మళ్లుతున్నారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని నిలబెట్టుకుంటారా? చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తారా? అని ఆశగా నిరీక్షిస్తున్నారు. 'పోగు'బడిన వ్యథను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.



మూలకు చేరిన మగ్గాలు

నేతన్న పగ్గం.. బతుకు దైన్యం

- జీఎస్టీతో చేనేత రంగం కుదేలు
- ముఖ్యమంత్రి హామీలు అమలయ్యేనా?
- చేనేత పార్కు కావాలంటున్న నేతన్నలు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం
- సీఎం చంద్రబాబు చీరాల రాక

చీరాల: చేనేత రంగంలో రెండు రకాల కార్మికులు ఉంటారు. స్వతంత్ర కార్మికులు, షెడ్డు కార్మికులు. సొంత మగ్గాలపై పనిచేసేవారిని స్వతంత్ర కార్మికులని, మాస్టర్ వీవర్ వద్ద షెడ్లలో ఉంటూ పనిచేసే వారిని షెడ్డు కార్మికులని పిలుస్తారు. షెడ్డు కార్మికులకు ఇల్లు ఉండదు. సొంత మగ్గం, ఇతర పరికరాలు ఉండవు. విద్య, వైద్యం వంటి కనీస వసతులూ అందవు. మాస్టర్ వీవర్ల దయాదాక్షిణ్యాలపైనే జీవితాలు కొనసాగుతాయి. చీరాలతోపాటు పొద్దుటూరు, ధర్మవరం, జమ్మలమడుగు, పెడన, ఐలవరం, బద్వేలు, ఆత్మకూరు, తాటిపర్తి వంటి ప్రాంతాల నుంచి 40 ఏళ్ల క్రితం వలస వచ్చిన చేనేత కార్మిక కుటుంబాలు చీరాలలోని చేనేత షెడ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో సుమారు 15 వేల మగ్గాలు, 20 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 50 శాతం మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకుంది.

కనీస వేతనానికీ కరువే..

కనీస వేతన చట్టం ప్రకారం ఒక కార్మికుడికి రోజుకు రూ.206 చెల్లించాలి. కానీ చేనేత కార్మికులకు ఈ చట్టం అమలు కాదు. వీరి కూలీ ధరలు నిర్ధారించలేమని కార్మికశాఖ చేతులెత్తేసింది. దీంతో హోటల్లో పని చేసే స్వీపర్ల కంటే వీరికి తక్కువ కూలీ లభిస్తోంది.

బాబు హామీలు నిలబెట్టుకుంటారా?

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తానని, కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని ప్రకటించారు. ఇప్పుడు హామీలు నిలబెట్టుకుంటారో లేదోనని చేనేత కార్మికులు ఆశగా నిరీక్షిస్తున్నారు. బుధవారం చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల రానున్న సీఎం చంద్రబాబుకు తమ గోడు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వం ముందున్న డిమాండ్లు

- చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించింది. రంగు, నూలు, రసాయనాలపైనా 29 శాతం జీఎస్టీ విధించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి జీఎస్టీని ఎత్తివేయించాలి.
- కూటమి ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించింది. ఇవి నేతన్న నేస్తం పథకానికి మాత్రమే సరిపోతాయి. చేనేతల పూర్వ వైభవానికి కనీసం రూ.700 కోట్లు కేటాయించాలి.
- ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని కేంద్రం నిలిపివేసింది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన చేనేత ఆత్మహత్యలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలి.
- చీరాలలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తానని గతంలో చంద్రబాబు ప్రకటించారు. టెక్స్‌టైల్స్ పార్కు బదులు చేనేత పార్కు ఏర్పాటు చేయాలి.
- ఆప్కో చేనేతలకు పడిన బకాయిలు వెంటనే చెల్లించాలి. ప్రభుత్వమే ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేనేతల ద్వారా వస్త్రాలను నేయించాలి. చేనేత కార్మికులనూ కార్మికశాఖలో భాగం చేయాలి.
- తమిళనాడు తరహా చేనేత విధానాన్ని అమలు చేయాలి. జాతీయ చేనేత అభివృద్ధి సంస్థ నూలు డిపోలను చేనేత ప్రాంతాలలోని వారికి అవసరమైన మేరకు పది శాతం రాయితీతో ఇవ్వాలి.
- ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొని ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు వారానికి ఒకసారైనా చేనేత వస్త్రాలు ధరించేలా ఆదేశాలు ఇవ్వాలి.
- ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
- జౌళి రంగం నుంచి చేనేత రంగాన్ని వేరుచేసి ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి. ఉనికిలో లేని చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయాలి.

గత ప్రభుత్వం చేయూత

చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు గత ప్రభుత్వం విశేష కృషి చేసింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు చేయూత అందించారు. అడుగడుగునా అండగా నిలబడ్డారు. చేనేత రంగానికి బడ్జెట్లో రూ. 200 కోట్లు కేటాయించారు. నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.24 వేలు అందించారు. దీంతోపాటు జిల్లాల వారీగా నిధులు కేటాయించి చేనేతల సంక్షేమం, ఉపాధికి ఖర్చు చేశారు. చేనేతలకు సబ్సిడీ రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించారు. చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేశారు.

జీఎస్టీ ఎత్తివేయాలి

చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించింది. రంగు, నూలు, రసాయనాలపై 29 శాతం జీఎస్టీ విధించడంతో చేనేత రంగానికి కోలుకోలేని దెబ్బతగిలింది. కూటమి ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే చేనేత రంగానికి బడ్జెట్‌లో కేటాయించింది. కనీసం రూ.700 కోట్లు కేటాయించాలి. ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని కేంద్రం పునరుద్ధరించాలి.

– దేవన వీరనాగేశ్వరరావు,
చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు

సీఎం పర్యటనకు ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

చీరాల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చీరాల పర్యటనను విజయవంతం చేయాలని చేనేత శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య కోరారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం చీరాల మండలం జాండ్రపేట హైస్కూల్, చేనేత ప్రాంతాలను మంత్రితోపాటు కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ, హ్యాండ్‌లూమ్ కమిషనర్ సునీత పరిశీలించారు. ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఐఎల్‌టీడీ అతిథి గృహంలో మంత్రి సవిత మాట్లాడుతూ చీరాలలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జాండ్రపేట హైస్కూల్‌లో జరిగే సదస్సులో సీఎం పాల్గొంటారని వివరించారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కొండకావరం

- ద్రోణాదుల కొండపై గ్రావెల్ తవ్వకం
- యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు రవాణా
- టీడీపీ నాయకుడి కీలకపాత్ర
- నిద్ర నటిస్తున్న అధికారులు



ద్రోణాదుల కొండపై జరుగుతున్న తవ్వకాలు

మార్టూరు: అధికారంలోకి వచ్చాం కదా.. మనల్ని ఎవరూ ఆపరంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు దోపిడీకి తెర లేపారు. మట్టి, ఇసుక, గ్రావెల్ ఏదైనా సరే కొల్లగొట్టి డబ్బు పట్టాల్సిందేనని కంకణం కట్టుకున్నారు. దీనికితోడు అధికారులూ వంత పాడుతూ చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలోని కొండపై అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తన జేసీబీలు, ట్రాక్టర్లతో గ్రావెల్‌ను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. చీరాల, బాపట్ల తదితర దూర ప్రాంతాల వారూ గ్రావెల్ తరలింపును వ్యాపారంగా మలుచుకుని లబ్ధి పొందుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామంలోని కొండపై గ్రావెల్ తవ్వకాలను గతంలో గ్రామానికి చెందిన యువకులు అడ్డుకోగా స్థానికంగా గ్రామ అవసరాలకు మినహా వ్యాపార పరంగా కానీ ఇతర ప్రాంతాలకుగానీ గ్రావెల్ వినియోగించరాదని పంచాయతీ తీర్మానం చేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ద్రోణాదుల గ్రామ పరిధిలోని కొండపై గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలపై దృష్టిపెట్టి చర్యలు తీసుకుంటాం.

– శివశ్రీను, డెప్యూటీ తహసీల్దార్

క్లుప్తంగా

ప్రముఖ కంటి వైద్యులు యడ్ల శ్రీరామమూర్తి మృతి


డాక్టర్ యడ్ల శ్రీరామమూర్తి (ఫైల్)

గుంటూరు మెడికల్: ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ యడ్ల శ్రీరామమూర్తి (81) మంగళవారం కన్ను మూశారు. గుంటూరు కొత్తపేట హోండా షోరూం వెనుక ఉన్న తన గృహంలో మృతి చెందారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ యడ్ల హనుమాన్‌ప్రసాద్ వెల్లడించారు. డాక్టర్ శ్రీరామమూర్తి కొద్దిరోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గుంటూరులో 1982లో శ్రీ రేణుక నేత్రాలయాన్ని స్థాపించి లక్షలాదిమంది కంటి జబ్బురోగులకు చికిత్స చేశారు. కోస్తాంధ్రాలో మొట్టమొదటిసారిగా 1989లో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి రికార్డు సృష్టించి వార్తల్లోకి ఎక్కారు. డాక్టర్ శ్రీరామమూర్తికి కుమారుడు డాక్టర్ హనుమాన్‌ప్రసాద్‌తో పాటుగా కుమార్తెలు రేణుక, సునీత ఉన్నారు. డాక్టర్ శ్రీరామమూర్తి మృతికి గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, ఐఎంఏ నేతలు, కంటి వైద్య నిపుణులు సంతాపం వ్యక్తం చేశారు.

9వ తేదీ వరకు శ్యామలానగర్ రైల్వే గేటు మూసివేత

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు–నల్లపాడు మధ్య డీప్ స్క్రీనింగ్స్ ఆఫ్ ట్రాక్స్ కోసం శ్యామలానగర్ రైల్వే గేటును ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు తాత్కాలికంగా మూసివేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. గుంటూరు – నల్లపాడు మధ్య లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద అత్యవసర మరమ్మతుల కారణంగా గేటును మూసివేశామని, ప్రయాణికులు గమనించి సహకరించాల్సిందిగా తెలిపారు. ఇటుగా ప్రయాణించే వాహనదారులు కంకరగుంట రోడ్ ఓవర్ బ్రిడ్జి, రోడ్ అండర్ బ్రిడ్జి మీదుగా ప్రయాణించాల్సిందిగా సూచించారు.

నేటి నుంచి నల్లపాడు–పేరేచర్ల గేటు మూసివేత..

నల్లపాడు–పేరేచర్ల మధ్య అత్యవసర పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 8 గంటల వరకు గేటును మూసివేస్తున్నామని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తెలిపారు.

దళిత మృత వీరుల కుటుంబాలకు అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యురాలు డి.రమాదేవి
- చుండూరు రక్త క్షేత్రం వద్ద సంస్మరణ సభ


చుండూరు రక్త క్షేత్రం వద్ద మృత వీరులకు నివాళులు

చుండూరు (భట్టిప్రోలు): మూడున్నర దశాబ్దాలు కావస్తున్నా చుండూరు దళిత మృత వీరుల కుటుంబాలకు న్యాయం జరగకపోవడం విచారకరమని ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యురాలు డి.రమాదేవి ధ్వజమెత్తారు. మంగళవారం బాపట్ల జిల్లా చుండూరులోని దళిత మృత వీరుల పేరుతో రక్తక్షేత్రం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మృతవీరుల సమాధుల వద్ద సీపీఎం, కేవీపీఎస్, దళిత, బహుజన, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జాలాది మోజెస్ అధ్యక్షతన జరిగిన సభలో రమాదేవి మాట్లాడుతూ అగ్రవర్ణాల దాడిలో చనిపోయిన వీరుల కుటుంబాలకు ప్రభుత్వాలు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెట్టి పేదలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, వివిధ సంఘాల నాయకులు బి.అగస్టీన్, శ్రీమన్నారాయణ, దళిత నాయకులు చార్వాక, రోజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ క్రిష్టయ్య
- రూ.4.5 లక్షల విలువైన రాగి, అల్యూమినియం తీగ సీజ్


సీజ్ చేసిన రాగి, అల్యూమినియం వైరు, పక్కన నిందితులు

అద్దంకి: పగలు సుబాబుల్ తోటల్లో పనులు చేసుకుంటూ రాత్రిళ్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగ చోరీ చేసే ముఠాను పోలీసులు పట్టుకొని కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం సీఐ క్రిష్టయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన పి.చెంచురామయ్య, యాటగిరి రామయ్య అనే యువకులు, మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి రాత్రిళ్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగను చోరీ చేస్తుంటారు. వీరంతా కలసి అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, చినగంజాం, వేటపాలెం, మార్టూరు మండలాల్లోని 39 కేసుల్లో ఆయా మండలాల్లోని పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగను చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు, మరో ఐదుగురు బృందంగా ఏర్పడి నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. వీరంతా రాత్రిళ్లు షికారుకనే నెపంతో పొలాల్లోకి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను చోరీ చేస్తున్నట్లు చెప్పారు. తేలికగా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా వారు ఎంచుకున్నట్లు సీఐ చెప్పారు. మండలంలోని శింగరకొండపాలెం గ్రామం వద్ద మంగళవారం వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4.5 లక్షల విలువైన తీగను రికవరీ చేసినట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

బాపట్లటౌన్: ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. బాపట్లలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని, గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీల మేరకు జీఓలను వేతనాల పెంపును అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ప్రమోషన్స్ వెంటనే అమలు చేయాలని, అనేక ప్రాజెక్టుల్లో రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని వీటిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలు నడపటం కష్టమని కేంద్ర ప్రభుత్వం ఈ కాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు రూ.300 కోట్ల పైగా నిధులు తగ్గించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాజెక్టుల్లో ఆయాల ప్రమోషన్లపై రాజకీయంగా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులు ఉంటేనే అమలు చేస్తామని అధికారులు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. అర్హత గల ఆయాలకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, సంఘం జిల్లా కోశాధికారి జి.శారద సంఘం నాయకులు ప్రమీల, సీత, మేరీ, బ్యూలా, మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశంపై గుంటూరు భారీ స్కోరు

- తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 372 పరుగులు చేసిన గుంటూరు జట్టు
- రసవత్తరంగా సీనియర్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ పోటీలు
- డబుల్ సెంచరీతో అదరగొట్టిన గుంటూరు బ్యాట్స్‌మెన్ కె.మహీప్



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు చెలరేగిపోవడంతో భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 372 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మెన్ కె.మహీప్ 274 బాల్స్‌లో 5 సిక్స్‌లతో 17 ఫోర్లతో చెలరేగిపోయి 274 పరుగులు సాధించాడు. మరో బ్యాట్స్‌మెన్ సూర్యవంశీ 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 78 పరుగులు చేశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 372 పరుగులు భారీస్కోర్ సాధించింది.

ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి

భట్టిప్రోలులో చేనేత కార్మికుల ధర్నా


భట్టిప్రోలులో ఆందోళన నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

భట్టిప్రోలు: జీఓ నెంబర్ 291 ప్రకారం చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేనేత కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం నాయకుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019 జీఓ ప్రకారం నేత నేస్తున్న చేనేత కార్మికులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కార్మికుల ఆర్థిక, స్థితి గతులను పరిశీలించి జీఓ ప్రకారం ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్లలో వినతి పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో బి.నాగమల్లేశ్వరరావు, బీవీ కోటేశ్వరరావు, బి.పెద్దిరాజులు, ఎ.శ్రీనివాసరావు, కె.కనకం, ఎస్.కృష్ణ, కె.కోటేశ్వరరావు, కె.పార్థసారధి, ఎన్.జగన్‌మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు పరమశివ (ఫైల్)

చీరాల: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చీరాల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక తెల్లగాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో నివాసముండే కనక పరమశివ (35) గత కొంత కాలంగా కుటుంబంలో విభేదాలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన పరమశివ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి అద్దంకిలో శతావధానం


కరపత్రం ఆవిష్కరిస్తున్న సాహితీప్రియులు

అద్దంకి: సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యంచే నాలుగో శతావధానం అద్దంకిలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు సాహితీ మిత్రమండలి గౌరవాధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని చిన్నిశాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవా సదన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో మంగళవారం కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారణాశి రఘురామశర్మ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో శతావధానంలో పేరుగాంచిన నారాయణం బాలసుబ్రహ్మణ్యం మన అద్దంకి వాసి కావడం, అద్దంకికి లభించిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. శతావధానం పద్యానికి సంబంధించిన ఒక పద్యక్రీడ అని, 350కి పైగా అష్టావధానాలు, మూడు శతావధానాలు చేసిన కవి, పండితునిచే నిర్వహించనున్న శతావధానం అద్దంకి సాహితీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుదని డాక్టర్ దేవపాలన అన్నారు. పద్యం పుట్టిన గడ్డపైన, పద్యం పాతబడ్డది అనేవారికి, పద్యం నిత్యనూతనం అని తన శతావధానం ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యం నిరూపిస్తున్నారని సృజన సంస్థ అధ్యక్షుడు గాడేపల్లి దివాకర దత్తు ప్రశంసించారు. శతావధాని నారాయణం తమ సమకాలికులవడం తమ అదృష్టమని రోటరీ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య వెల్లడించారు. కార్యదర్శి కె.వి.పోలిరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొలలపూడి శ్రీనివాసరావు, లక్కరాజు శ్రీనివాసరావు, లక్కరాజు విశ్వమోహన్, బాచిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కర్రతో దాడిచేసిన భర్త.. భార్య మృతి

మనస్థాపంతో భర్త ఆత్మహత్య


మృతులు వాకా బాబూరావు, మహాలక్ష్మి

రేపల్లె రూరల్: క్షణికావేశంతో చోటు చేసుకున్న ఘటనలో రెండు నిండు ప్రాణాలు బలైన సంఘటన మండలంలోని మైనేనివారిపాలెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రేపల్లె మండలం మైనేనివారిపాలెం గ్రామానికి చెందిన వాకా భాబూరావు(55) అతని భార్య మహాలక్ష్మమ్మ(50)ల మధ్య మనస్పర్ధలు చోటు చేసుకున్నాయి. బాబూరావుకు, మహాలక్ష్మికి వాగ్వాదం జరిగి బాబూరావు మహాలక్ష్మిని కర్రతో కొట్టటంతో ఆమె తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందింది. భార్య మృతిని చూసిన బాబూరావు తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి మృతి చెందాడు. రోజు మాదిరిగా వారి రెండవ కుమారుడు నందీశ్వరరావు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. అప్పటికే మంచంపై రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని, విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి స్థానికులకు తెలియజేసి ఇరువురిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించాడు. అప్పటికే ఇరువురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాబూరావు నోటి వెంట నురగ ఉండటంతో పురుగుమందు తీసుకుని ఉండవచ్చని వైద్యులు వెల్లడించారు. నందీశ్వరరావు ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ నజీర్‌బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బాపట్లటౌన్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కొండుబోట్లవారిపాలెంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సోమవారం రాత్రి గౌహతి నుంచి బెంగళూరు వెళ్తున్న గౌహతి ఎక్స్‌ప్రెస్‌లో అసోం రాష్ట్రం, ఉదల్‌గురి జిల్లా, నేపాల్‌పురి గ్రామానికి చెందిన బాబూలాల్ ముర్ము(31) తాపీ పని నిమిత్తం బెంగళూరు వెళుతుండగా ప్రమాదవశాత్తు రైలులో నుంచి సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో జారి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన ముర్ము ఘటనా స్థలం నుంచి పైకి నడుచుకుంటూ వస్తూ మండలంలోని కొండుబొట్లపాలెం గ్రామం సమీపంలోని పంటపొలాల దగ్గరకు వచ్చేసరికి స్పృహతప్పి పడిపోయి మృతిచెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదుచేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

గుంటూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి

చేబ్రోలు: విద్యార్థుల్లోని సృజనాత్మకత పెంచి కొత్త ఆవిష్కరణల దిశగా వారిని తీర్చిదిద్దాలని, బాల శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని గుంటూరు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి చెప్పారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే రీజినల్ లెవల్ వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్ సైన్స్ ఉపాధ్యాయులు 35 మంది పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లోని వివిధ పరికరాలు ఎలా ఉపయోగించాలి? ప్రొజెక్టర్ ల్యాప్‌టాప్ పబ్లిక్ అడ్రస్ సిస్టం మొదలు ఎలక్ట్రానిక్ పరికరాలతో విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధనా విధానాలను వివరించారు. ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ మనం నిత్యం ఎదుర్కొనే సమస్యలకు కొత్తగా పరిష్కారమార్గాలను కనుగొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏవీఎస్ ప్రసాద్, ఆర్ సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి గౌస్, హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

ముప్పాళ్ల: మండలంలోని తొండపి గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ముజావర్ సైదాపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సత్తెనపల్లి నుంచి భార్యతో కలిసి ముప్పాళ్ల వస్తున్న సైదాపై పీబీసీ కాల్వ వద్ద వాహనాన్ని ఆపి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయిడి హనుమంతరావు దాడికి పాల్పడ్డాడు. ఆ సంఘటనతో తీవ్ర మనస్థాపానికి గురై చనిపోతానంటూ సైదా ఇల్లు విడిచి వెళ్లిన సంగతి తెలిసిందే. భార్య ఫిర్యాదు మేర విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా సైదా కర్నూలులో ఉన్నట్లు గుర్తించారు. సైదా కర్నూలులో ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ మేర పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి కర్నూలు వెళ్లి మంగళవారం ఇంటికి తీసుకువచ్చారు. సంఘటన జరిగిన తీరుపై సైదా నుంచి పోలీసులు పూర్తి వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు రాయిడి హనుమంతరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ.హజరతయ్య మంగళవారం తెలిపారు.

స్కూటీలోని రూ. 6 లక్షలు చోరీ

ప్రత్తిపాడు: పట్టపగలు స్కూటీలో ఉంచిన నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గణేశన మురళీకృష్ణ మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడులోని యూనియన్ బ్యాంకులో రూ.6 లక్షల నగదును విత్ డ్రా చేశాడు. ఆ నగదును స్కూటీలో పెట్టి తాళం వేసుకుని ఇంటికి బయల్దేరాడు. ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని ఓ కూరగాయల దుకాణం వద్ద స్కూటీ నిలిపి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. కూరగాయలు కొనుక్కుని తిరిగి వచ్చేప్పటికి స్కూటీ సీటు తెరచి ఉండటం, అందులో ఉన్న నగదు మాయమవ్వడాన్ని గమనించిన మురళీకృష్ణ ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించాడు.

మంగళగిరిలో నేడు జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: పట్టణంలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత ఏడీఏ వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తోపాటు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, పలువురు చేనేత జౌళి సహాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అవయవదానం పుణ్యకార్యం



లక్ష్మీపురం: అవయవదానం పుణ్యకార్యమని కస్టమ్స్, జీఎస్టీ విశాఖపట్నం జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ అన్నారు. స్థానిక గుంటూరు జీఎస్టీ కార్యాలయంలో అంగ్దాన్ జన్ జాగృత అభియాన్, అవయవ దానం దినోత్సవంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంజయ్‌రాఠీ మాట్లాడుతూ అవయవాల దానంతో ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన గుంటూరు జీఎస్టీ అధికారులను ఆయన అభినందించారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. స్పెక్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీజీఎస్టీ గుంటూరు కమిషనరేట్, సీజీఎస్టీ తిరుపతి కమిషనర్, కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, విజయవాడకు చెందిన 200 మంది అధికారులు పాల్గొని అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. జీఎస్టీ అధికారులు బి.లక్ష్మీనారాయణ, ఉపేంద్ర ధ్రువ్ తదితరులు పాల్గొన్నారు.

'దేశీ'య రైతుకు గౌరవం

- అత్తోట బాపారావుకు ఈషా ఫౌండేషన్ పురస్కారం
- ప్రకృతి, దేశీ విధానంలో వరి పంటల సాగుతో సత్ఫలితాలు
- భూమి భారతి పేరుతో దేశీ వరి విత్తన నిధి
- తొమ్మిదేళ్ల అవిరళ కృషికి దక్కిన గుర్తింపు


బాపారావుకు ఈషా ఫౌండేషన్ పురస్కారం

తెనాలి: ప్రకృతి వ్యవసాయాన్ని, దేశీ వరి సాగును చేపట్టి, తోటి రైతులను ప్రోత్సహిస్తూ విస్తృతం చేస్తున్న తెనాలికి చెందిన ప్రకృతి రైతు యర్రు బాపారావుకు తమిళనాడుకు చెందిన ఈషా ఫౌండేషన్ ఉత్తమ రైతు పురస్కారం లభించింది. ఈషా ఫౌండేషన్‌చే గత నెల 28న తమిళనాడులోని వెల్లూరులో నిర్వహించిన భారతీయ సంప్రదాయ వరి, ఆహారోత్పత్తుల ఉత్సవంలో ఈ గౌరవాన్ని స్వీకరించారు. వీరితోపాటు కృష్ణాజిల్లాకు చెందిన కె.రంజిత్ కుమార్, పశ్చిమగోదావరి రైతు జి.రాము, శ్రీకాకుళం జిల్లా రైతు బి.జగ్గారావు ఈ పురస్కారాన్ని అందుకున్నవారిలో ఉన్నారు.

ఉద్యోగం వదిలి వచ్చి..

తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోట యర్రు బాపారావు స్వస్థలం. ఉన్నత విద్యావంతుడు. హైదరాబాద్‌లో గ్రాఫిక్ డిజైనర్, 2డీ ఏనిమేటర్‌గా ఉద్యోగం చేసేవాడు. సురక్షిత ఆహారం ప్రాధాన్యాన్ని గుర్తించి సొంతూరులోనే ప్రకృతి వ్యవసాయం చేపట్టాడు. తనకున్న ఎకరంన్నర సొంత భూమిలోనే ప్రకృతి వ్యవసాయం ఆరంభించాడరు. తర్వాత మరో ఏడెకరాల కౌలు భూమికీ సాగును విస్తరించాడు. దేశీ వరి విత్తనాలను సేకరించి, తాను పండిస్తూ, తోటి రైతులకు అందిస్తూ, వాటి సాగును విస్తృతం చేస్తూ వచ్చాడు. ఈవిధంగా తొమ్మిదేళ్ల క్రితం ప్రకృతి సేద్యం ఆరంభించిన బాపారావు 365 రకాల దేశీ వరి విత్తనాలను సాగు చేస్తున్నాడు. భూమి భారతి పేరుతో దేశీ వరి విత్తన నిధిని అత్తోటలో 'తానా' సహకారంతో ఆరంభించాడు. ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహంతో ఇప్పుడు అత్తోటలోని 60 మంది రైతులు 85 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం, దేశీ వరి సాగు చేస్తున్నారు. తాను, తోటి రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సంబంధిత స్టాళ్లలో, సోషల్ మీడియా ద్వారా విక్రయాలు చేస్తున్నారు. ప్రవాస భారతీయులు మౌనికా రెడ్డి దంపతుల సాయంతో విజయవాడలోని కనకదుర్గ అమ్మ వారికి , మరో ఎన్ఆర్ఐ తాళ్లూరి జయశేఖర్ దంపతుల సాయంతో భద్రాచలంలోని సీతారాముల వారికి ఏడాది పొడవునా నైవేద్యం కోసం బాపారావు, అత్తోటలోని ఇతర రైతులు కలిసి పండించిన దేశీ వరి బియ్యాన్ని పంపుతుండటం మరో విశేషం! ఈ కారణంగానే ఆయన్ను ఈషా ఫౌండేషన్ ఉత్తమ రైతుగా సత్కరించింది.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకలకు ఏఎన్‌యూ విద్యార్థులు


ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: ఈనెల 15న ఢిల్లీలోని ఎరక్రోటలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. వర్సిటీ పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్న బుర్ర దివ్యశ్రీ, ఫార్మా డీ చదువుతున్న ఎస్.రేవంత్ సాయి ఈ వేడుకలకు ఎంపియ్యారు. వీరిని మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థులు సామాజిక సేవలో అన్ని వర్గాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది పాల్గొంటుండగా వారిలో ఏఎన్‌యూ నుంచి ఇద్దరు ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వి.దివ్యతేజోమూర్తి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.